‘మద్దేన్నపేల సుక్కయ్య మామ తెచ్చిన జీలుగు కల్లు ఉన్నది. దొరకు కొంచెం పోస్త. ఇంత కూడు దిని పండుకుంటడు’ అనుకున్నది లచ్చి.

గ్లాసు శుభ్రంగా కడిగి జీలుగు కల్లు ఒడియ పోసి తీసుకొచ్చింది.

‘‘దొరా! జీలుగు కల్లు. కొంచెం రుచి సూడండి. చెట్టు మీది నీరం కదా, అలసట తగ్గి మంచిగ నిద్ర పడ్తది’’ అంటూ గ్లాసు చేతికి అందించింది.

దొర ఏమీ మాట్లాడకుండా గ్లాస్ తీసుకొని సిప్ చేశాడు. ఒంట్లో బడలిక, బయట చల్లటి గాలి. ఆ సమయంలో ఈ చల్లటి జీలుగు కల్లు రుచి కొత్తగా అనిపించింది దొరకు. ప్లేట్లో కోడిగుడ్ల కూర తెచ్చిపెట్టింది లచ్చి. రెండు మూడు గ్లాసులు తాగేసరికి సరిపోయింది దొరకు. కానీ జీలుగు కల్లు బాగా నిషాను కలుగజేసింది.

ఇంట్లో ఫారిన్ విస్కీ తాగే అలవాటున్న దొరకు.. ఆ కల్లు బాగా మత్తును కలుగజేసింది. రాత్రిపూట బాగా పొద్దుపోయింది. సిరవడు ఇంకా రాలేదు. ఇంట్లో తన భార్య డెలివరీకి ఉన్నది. ఆమె ఆరోగ్యం ఎలా ఉందో ఏమో!? ఫోన్ కలవడం లేదు. వర్షం తగ్గడం లేదు. జీలుగు కల్లు నిషా, రప్పున తలకు ఎక్కుతున్నది. భార్య డెలివరీకి ఉన్నది. తనకు చాలారోజులుగా స్త్రీ సాంగత్యం లేదు. అడవిలో, గుడిసెలో, లచ్చి ఒక్కతే ఉన్నది. బయట చలిగాలి వీస్తున్నది. పాతిక సంవత్సరాల లచ్చి. నిండు ఆరోగ్యంతో కళ్లముందు తిరుగుతూ ఉంటే.. మనసు స్థిరం తప్పుతూ ఉన్నది. ఆలోచనలు కలగా పులగమై అదుపుతప్పాయి.

లచ్చి చేయి పట్టుకున్నాడు దొర.

దొరలోని ఈ వింత ప్రవర్తనకు లచ్చి ఆశ్చర్యపోయింది.

‘‘దొరా!’’.. భయంగా అన్నది లచ్చి.

‘‘లచ్చీ.. నా కోరిక తీర్చవా? నిన్ను చూస్తుంటే తట్టుకోలేక పోతున్నా. నిన్ను కోరడం నాది తప్పే. అయినా నిగ్రహించుకోలేక పోతున్నా. నా కోరిక తీర్చు..!’’ మత్తులో ఉన్నాడు దొర.

దొర బేలగా అభ్యర్థించేసరికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు ఆమెకు.

‘‘దొరా! మీరు మాకు దేవర. మీ ఉప్పు తిని బతుకుతున్నం. వరాలు ఇచ్చే దేవుడే వచ్చి, కోరిక తీర్చమని అడుగుతా ఉంటే.. నేను ఏం సెప్పాలె దొరా! కానీ, నేను ఒకరికి ఆలిని కదా. నన్ను ఆ సూపుతో సూడటం తప్పు కదా దొరా’’

‘‘అవును! నాకు తెలుసు లచ్చి. కానీ నాకిప్పుడు ఆడదాని సాంగత్యం కావాలనిపిస్తుంది. కోరికతో మనసు నిలకడ ఉంటలేదు. కాదనకు..!’’ అంటూ ఆమె కాళ్లు పట్టుకున్నాడు దొర.

అప్పటికే జీలుగు కల్లు మత్తు బాగా తలకెక్కింది అతనికి. తనపై తాను నియంత్రణ కోల్పోతున్నాడు.

‘‘సరే.. గట్లనే దొరా! ముందు మీరు కూడు తినండి. ఈలోపు నేను బుడ్డోణ్ని పండుకోబెట్టి వస్త. మీరు మాకు దేవర. మీ కోరిక తప్పకుండ తీరుస్త దొరా’’ అంటూ నచ్చజెప్పి, దొరకు అన్నం తినిపించింది. కొడుకును నిద్రపుచ్చి, తాను తిని వచ్చింది.

మంచంలో కూర్చుని ఉన్నాడు దొర. అన్నం తిన్న తర్వాత అతని మనసు కాస్త స్థిమిత పడింది. కల్లు ప్రభావం చాలావరకు తగ్గిపోయింది. ఫోన్ సిగ్నల్ కలిసింది. ఇంటి నుండి వచ్చిన వీడియో ఓపెన్ చేసి చూశాడు. అతని మత్తు పూర్తిగా దిగిపోయింది.

మంచంలో కూర్చున్న దొర కాళ్ల దగ్గర కూర్చుంది లచ్చి. నేల మీద కూర్చుని, అతని కాలు మీద తడుతూ..

‘‘దొరా! నేను వచ్చిన. బుడ్డోడు నిద్రపోయిండు’’ అన్నది పొడిపొడిగా.

దొర ఏమీ మాట్లాడకుండా అచేతనంగా ఉండటం చూసి అతని మొహంలోకి చూసింది లచ్చి. అతని కంటి నుండి నీటి చుక్కలు కారి ఆమె ముఖంపై పడ్డాయి. ఉలిక్కి పడింది లచ్చి.

‘‘దొరా.. ఏమైంది? ఏమన్నా తప్పు జరిగిందా? మీరు మాకు దేవర. మీ కోరిక తీర్చుతనని సెప్పిన కదా!’’

దొర మౌనంగా ఫోన్ ఆన్‌చేసి ఆమె చేతికి ఇచ్చాడు. ఈరోజు అతని ఇంట్లో జరిగిన విషయమంతా చాలా వివరంగా ఉంది ఆ వీడియోలో. లచ్చి ఆసక్తిగా చూడసాగింది.

* * *

గౌరీపేటలోని దొర భవంతిలోకి సిరవడు అడుగుపెట్టగానే.. వర్షం ప్రారంభమైంది. పెద్ద దొరసాని సిరవడిని చూసి..

‘‘సిరవా! అమ్మగారికి నొప్పులు వస్తున్నయి. మంత్రసాని వచ్చింది. దొర కూడా సమయానికి లేడు. నువ్వు ఈ పూట మాకు తోడుగా ఇక్కడే ఉండాలి’’ అన్నది.

‘‘గట్లనే తల్లీ! ఈడనే ఉంట’’ అన్నాడు సిరవడు.

ఆ ఇంటికి సేవ చేయడం తన భాగ్యం అన్నట్లుగా జవాబు ఇచ్చాడు అతను. దొరసానికి నొప్పులు ఎక్కువైనాయి. కానీ, కానుపు కష్టమైపోయింది. బిడ్డ అడ్డం తిరిగి.. తల్లీపిల్ల ప్రమాదంలో పడ్డారని మంత్రసానికి అర్థమైంది.

పక్కూరు నుండి డాక్టరమ్మను తీసుకురావాలి. కానీ, వర్షం వదలకుండా జోరున కురుస్తున్నది.

‘‘సిరవా! అమ్మగారికి కడుపుల బిడ్డ అడ్డం తిరిగింది. ఆమె ప్రాణం ప్రమాదంలో ఉన్నది. పక్కూరు నుండి డాక్టర్ను తీసుకురాకపోతే ప్రాణాలు దక్కవు. ఏం చేద్దాం’’ అన్నది పెద్ద దొరసాని.

‘‘డాక్టరమ్మను ఎట్లనైన తీసుకొస్త దొరసాని’’ అన్నడు సిరవడు.

ఆ వర్షంలోనే బయల్దేరాడు.

డాక్టరమ్మ ఉండే ఊరికి, దొర భవంతికి మధ్యల ఒక కాలువ ఉన్నది. ఈ కుండపోత వర్షానికి ఆ కాలువ పొంగి పారుతున్నది. మనుషులను దాటనివ్వడం లేదు. కానీ, సిరవడు ఊరుకోలేదు. అతని మనసులో ఒకటే ఆలోచన మెదుగుతూ ఉన్నది.

‘డాక్టరమ్మ రావాలె! దొరసాని బతకాలె!’..

కాలువ దాటి డాక్టరమ్మ ఇంటికి చేరాడు. కానీ, ఈ వర్షంలో రావడానికి నిరాకరించింది డాక్టరమ్మ.

డాక్టరమ్మ కాళ్లు పట్టుకున్నాడు సిరవడు. ఆమె వస్తాననేదాకా వదిలిపెట్టలేదు. కానీ, కాలువ దాటడం ఒక సమస్యగా ఉన్నది. కాలువ ఒడ్డుకు చేరిన తర్వాత.. డాక్టరమ్మను ఎత్తుకొని భుజం మీద కూర్చోబెట్టుకున్నాడు. ఆ వర్షంలోనూ, వరదలలోనూ అతి కష్టంమీద డాక్టరమ్మను భుజంపై మోస్తూ కాలువ దాటించాడు. దొర ఇంటికి తీసుకువచ్చాడు.

అప్పటికే ప్రాణాపాయ స్థితికి చేరుకున్నది దొరసాని. సమయానికి వచ్చి రెండు ప్రాణాలనూ కాపాడింది డాక్టర్.

పెద్ద దొరసాని డాక్టరమ్మకు చేతులెత్తి మొక్కింది. డాక్టరమ్మ ఆమెను వారిస్తూ..

‘‘పెద్దవారు.. మీరు నాకు దండం పెడితే ఆయువు తగ్గుతుందని అంటారు. నిజంగా మీరు దండం పెట్టాల్సింది సిరవడికి. ఈ వర్షంలో నేను రానని అంటే.. నా కాళ్లు పట్టుకొని వదలలేదు. చిన్నపిల్లను ఎత్తుకున్నట్లు భుజాలపైకి ఎత్తుకొని కాలువ దాటించాడు. ఈ రెండు ప్రాణాలు నిలబడ్డాయి అంటే.. ఆ క్రెడిట్ అతనికే దక్కుతుంది’’ అన్నది.

* * *

వీడియో అయిపోయింది. ఆ వీడియో చూసి సంతోషంతో తల మునకలైంది లచ్చి.

‘‘దొరా! సిరవడు నాతోటి చాలాతూర్లు అన్నడు.. ‘మన దొర రునం ఎట్టా తీరతాది లచ్చీ!’ అని. ఇప్పుడు దొరసానికి, బిడ్డకు పానం పోసి ఆ రునం తీర్చుకున్నడు’’ అన్నది లచ్చి.

తన కాళ్ల దగ్గర కూర్చున్న లచ్చి తలమీద చేయివేసి నిమిరాడు దొర.

‘‘నిజమే లచ్చీ! అక్కడ రెండు ప్రాణాలను కాపాడి సిరవడు రుణం తీర్చుకున్నాడు. కానీ ఇక్కడ మద్యం మత్తులో నిన్ను కోరరాని కోరిక కోరి, నేను మహాపాపం చేసిన’’

‘‘అట్టా అనమాకండి దొరా! మీరు మాకు దేవుడు. మా కుటుంబాలను కాసుకుంటున్న దేవర. మద్దెన ఈ కల్లు మత్తు బాగా చికాకు చేసింది దొరా! గంతే!’’

‘‘అవునే లచ్చీ! నా ఎస్టేట్‌లో బతికే మీరందరూ నా పిల్లల్లాంటి వాళ్లు. అందుకే మీ దేవర.. జీలుగు కల్లు రూపంలో నాకు పరీక్ష పెట్టిండు. ఆ పరీక్షలో నువ్వు నెగ్గేటట్లుగ చేసిండు’’

‘‘దొరా! మీరు బాగా అలసిపోయినరు. పడుకోండి!’’ అంటూ దొరను పడుకోబెట్టి.. చెద్దరు కప్పింది లచ్చి.

కాళ్లు వత్తుతూ నిద్రపుచ్చింది. ఆ ఇంట్లో తడక అవతల బుడ్డోడు. తడక ఇవతల దొర.. నిద్రలో నవ్వుకుంటున్నారు. ఏం కలలు కన్నారో ఏమో!? ■

## ఎస్.నాగేందర్‌నాథ్ రావు



‘మంచికి–చెడుకు’ మధ్య జరిగే పోరాటం, ‘మనసు–తనువు’ మధ్య రగిలే సంఘర్షణను పట్టిచూపే ప్రయత్నం.. ఈ ‘దేవర’ కథ. రచయిత ఎస్. నాగేందర్‌నాథ్ రావు. వీరి స్వస్థలం హైదరాబాద్. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 36 ఏళ్లు పనిచేసి, విరమణ పొందారు. తొలి నియామకం.. భద్రాచలం దగ్గరి కూనవరం ప్రాంతంలో ఉండే ఉప్పనపల్లి గుట్టల ప్రదేశం. అది పూర్తిగా అడవి ప్రాంతం. అక్కడందరూ కోయ ప్రజలే నివసించేవారు. అక్కడ ఉద్యోగం చేసిన సమయంలో కోయ భాష నేర్చుకున్నారు. వారి భాషలోనే మాట్లాడుతూ పిల్లలను ఆకట్టుకొని విద్యా బోధన చేసేవారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు కూడా పొందారు. తన సర్వీసు మొత్తం గిరిజన సంక్షేమ శాఖ విద్యార్థులతోనే గడిపారు. రచయితగానూ అనేక కథలు, పాటలు, వ్యాసాలు, కవితలు రచించారు. వీటిలో చాలావరకు అన్ని ప్రముఖ పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. వీరి రచనలు మొత్తం ఏడు పుస్తకాలుగా ప్రచురించారు. 2016లో ‘అమ్మ’ కథల సంపుటి, 2023లో ‘గెలుపు’ కథల సంపుటి ప్రచురితం అయ్యాయి.